# మార్కెట్ రైటర్

-బులుసు-జీ-ప్రకాష్

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు "రచయితలలో మార్కెట్ రచయితలు వేరయా" అనే కొత్త సూక్తిని సృష్టించింది 'వామన' అనే చిత్ర విచిత్ర వారపత్రిక.

ఒక మార్కెట్ రచయితగారి సీరియల్ నవలలు నాలుగు వారపత్రికలలో ధారావాహికంగా ప్రచురింప బడుతున్నాయి. అతని సీరియల్ నవల ఏ పత్రికలో ప్రచురింపబడితే ఆ పత్రిక సర్కులేషన్ వామనమూర్తి లాగ ఆకాశాన్నంటేస్తోంది. ఇది పోటీ ప్రపంచం కదా!

మార్కెట్ రచయితలు కానివారు ఏ పత్రికకైనా సీరియల్ నవల పంపదలిస్తే నవల అంతటినీ ఒకేసారి పంపాలి. లేకపోతే ఆ నవల పరిశీలనకు స్వీకరించ బడదు. కాని మార్కెట్ రచయితల విషయంలో మినహా యింపు ఉంది. వాళ్లు ఏ వారానికావారం, పీస్ బై పీస్, బిట్ బై బిట్ పంపినా ఆ పత్రిక వారు ఆమో దిస్తారు. కారణం- ఆ మార్కెట్ రచయిత సీరియల్ లేకపోతే ఆ పత్రిక సర్క్యులేషన్ బలిచక్రవర్తిని కలుసు కుంటుంది!

'వామన' ఎడిటర్ గారు తమ ఆఫీసులో పని చేస్తున్న కుర్రాణ్ణి, మార్కెట్ రైటర్ గారింటికి వారం వారం పంపిస్తూ సీరియల్ బిట్‌ని రప్పించుకుంటూ అచ్చువేయించుకుంటున్నారు. ఆ సీరియల్లోని హీరో యిన్ పేరు 'శాంతి'. ఒక వారం మార్కెట్ రైటరు గారు పంపిన బిట్‌లో హీరోయిన్ హఠాత్తుగా 'రజని' అయిపోయింది! దానితోపాటు ఇంగ్లీష్‌లో ఉన్న ఓ కాయితం ముక్క కూడా వచ్చేసింది. 'వామన' ఎడిటర్ గారు గాభరా పడిపోయారు. సీరియల్ కంటిన్యూయిటీ దెబ్బతినేసింది. వెంటనే ఆ మార్కెట్ రైటర్ గారి మొబైల్‌కి ఫోన్‌చేసి ఆ విషయం చెప్పారు.

"రజని హీరోయిన్‌గా ఉన్న ఆ బిట్ వెనక్కి పంపే యండి. శాంతి హీరోయిన్‌గా ఉన్న బిట్ పంపిస్తు న్నాను" అని 'వామన' ఎడిటర్ గారికి తెలియజేశారు.

'రజని' హీరోయిన్‌గా ఉన్న బిట్ వెనక్కొచ్చేసింది. 'శాంతి' హీరోయిన్‌గా ఉన్న బిట్ 'వామన' ఎడిటర్ గారికి అందిపోయింది.

మార్కెట్ రైటర్‌గారు పెళ్లాంమీద చిందులేశారు. "ఏంవే! నా టేబుల్ మీద నాలుగు దస్తాలు తెల్లకాయి తాలు విడివిడిగా పెట్టి, ఒక్కొక్క దస్తామీద ఒక్కొక్క ఇంగ్లీష్ నవల బోర్లించి ఉంచాను. అవి ఎలా చెదిరి పోయాయ్?" అని గద్దించారు.

"నాకేం తెలుసండీ? మన బుజ్జిగాడు కీ విమానం ఎగరేశాడు. అది ఎగిరెగిరి మీ టేబుల్ మీద పడి పుస్తకాలూ కాయితాలూ చిందర వందర అయిపో యాయి. అవన్నీ సర్దిపెట్టాను" అంది సతీమణి.

"ఏడిసినట్టుంది. సరిగ్గా చూస్కో అక్కర్లా? నేను అనువదిస్తున్న ఇంగ్లీష్ నవలల్లో 'శాంతి' హీరోయిన్‌కి బదులు 'రజని' హీరోయిన్ అయిపోయింది. దాన్తోపాటే ఇంగ్లీష్ నవలలోని పేజీ కూడా ఆయనకి వెళ్ళి పోయింది. నయమే! 'వామన' పత్రిక వాళ్లు ముందే తెలియజేశారు. లేకపోతే మన నవలలు కాపీ అని తెలిసిపోయి ఉండేది" అన్నాడు మార్కెట్ రైటర్.

"ఆఁ కొంపేమీ మునిగిపోలేదు లెద్దురూ! కాపీ కొట్టడానికి రైట్ ఉండడమే కాపీరైట్ అంటే" అని సమర్థించింది అర్ధాంగి. ■

## హరిదాసు నానీలు

రూల్సు రూళ్ల కర్రలు / శాసిస్తాయి
కొండొకచో ఆశిస్తాయి తప్ప
పోషించవు

మూడు గంటల్లో
ఎంత తెలివి కుమ్మరించాలి?
కొండను / అద్దంలో చూపినట్లు

బురద చల్లడం / చల్లుకోవడం
రెండూ తేలికే
కడుక్కోవడమే కష్టం!

ఈ యేడు / అంతటా స్వర్ణోత్సవాలే
అందుకేనేమో
బంగారం ధర చుక్కల్లో

ఆధునిక వైద్యపు
దయాభిక్ష కడుపుకోత
నేటి శిశువు
అయోనిజ

-డా॥ మచ్చ హరిదాసు